# పెద్ద చేప

మరీ మరీ చెప్పున్నారు కదా ఈ వేళైనా పేపర్లన్నీ క్షుణ్ణంగా చదివి కాస్త లోక జ్ఞానం ఒంట పట్టించుకుందామనే సదుద్దేశంతో మంచం మీద పేపర్లన్నీ పరుచుకుని ముందు సినిమా రంగం వార్తలు చదవడం మొదలెట్టా. ఏమంచి పనికైనా ఆటంకాలు తప్పవని వూరకే అన్నారా. బెల్లు మోగింది.

నా అదృష్టం కొద్దీ, ఈయన ఆదివారం నిద్ర పోకుండా లాన్లో కలుపుమొక్కలు పీకుతున్నారు. ఇక సాయంత్రం వరకూ మన జోలికి రారు. లేకపోతే ఈపాటికి ఎవరా బెల్లుకొట్టిందని నన్ను చంపుండేవారు.

తన దృష్టిలో నేను ఆల్ పవర్‌ఫుల్. ఎంత గౌరవమో నేనంటే. విమానం చప్పుడు వినిపించినా, దొడ్లో కొబ్బరిమట్ట పడ్డా, వీధిలో కుక్కలు పోట్లాడుకున్నా, గంగిరెద్దులవాళ్ళు కర్ణకఠోరంగా సన్నాయి వాయించినా, అయ్యప్ప సాములు మైకులాపకపోయినా - అన్నిటికీ నేనే కారణమయినట్టుగా నాకేసి చుర చురా చూస్తూ అదేమిటో కనుక్కొని సరిచేయమంటారు.

ఎవర్రా అక్కడ కొంచెం వాకిట్లో చూడండి. ఎవరో వచ్చినట్టున్నారు.

రెండు నిమిషాలాగి మళ్ళీ బెల్ వినిపించింది. మన ఇంట్లో పేరు పెట్టి పిలిచి, బొట్టుపెట్టి పని చెప్తేనే దిక్కుండదు. ఇక ఎవర్రా అక్కడ అంటే, ఎవరు కదుల్తారు? ఇంక లోకజ్ఞాన సమీకరణ కార్యక్రమాన్ని పక్కన పెట్టి పడుతూ, లేస్తూ వెళ్ళా, తలుపు తీద్దామని. ఇంతలోకే మా అత్తగారు తలుపు తీసినట్టున్నారు. అవతలాయన అడుగుతున్నారు - "ఇది సుశీలగారి ఇల్లేనాండీ ?"

"రా! రా! హరీ! మరీ అలా అడక్కు. మా ఆయన వింటే నొచ్చుకుంటారు. లోపలికిరా. అప్పుడొస్తానన్నవాడివి ఇప్పుడా రావటం!"

"హమ్మయ్య గుర్తున్నానన్నమాట! "

"గుర్తుపట్టలేనంత హోదా లేదు. వయస్సూ రాలేదులే. కాకపోతే కాస్త మందం. నీకు తెలుసుగా. తెల్లవార్లూ చచ్చీచెడీ ఒక చాప్టరంతా కంఠతాపెట్టి ఒక్క కునుకుతీసి లేచేసరికి తెల్ల కాయితమల్లే స్వచ్ఛంగా అయిపోయేది నాబుర్ర. ఏదో అదృష్టం బాగుండి నెట్టుకొచ్చిన బాపతు నాది. ఉండు. ఈయన్ని పిలుస్తా. ఏవండోయి, స్వామీ ఒక్కసారి లోపలికి రండి!"

"ఇంకా ఏమిటి సంగతులు? రమా, పిల్లలూ ఎలా ఉన్నారు? ఇద్దరికీ పెళ్ళిళ్ళయిపోయా యన్నావుగా!"

"ఆఁ, పెద్దల్లుడూ నేనూ కలిసే పనిచేస్తున్నాం చిన్నదీ, అల్లుడూ డాక్టర్లు. దుబాయిలో వుంటున్నారు. రమ ఠాణాలోనే హెడ్‌మిస్ట్రెస్‌గా పనిచేస్తోంది. ఈ ఏడాది రిటైరైపోతానంటోంది!"

హరి అని మేమంతా పిలిచే ఇతని పూర్తి పేరు హరినారాయణ. మేం రాజమండ్రిలో పి.యు.సి. చదివే రోజుల్లో పక్కింట్లో కాలేజీ లెక్కల లెక్చరర్ రామనాథంగారని ఉండేవారు. ఆయన పెద్దబ్బాయి. మేమంతా ఒకే సెక్షన్. మాస్టారు రోజూ ఉదయం నాలుగునించి ఎనిమిదింటివరకూ ట్యూషన్లు చెప్పేవారు మళ్ళీ, సాయంత్రమూ అంతే.

ఆయన ట్యూషన్లైపోయాక హరీ వాళ్ళు నలుగురబ్బాయిలు అర్ధరాత్రి వరకూ చదువుకునేవారు. వాళ్ళకి చదువు తప్ప మరో ప్రపంచం లేదు. కానీ మా ఇంట్లో మాకు చదవటం ఓ కాలక్షేపం. ఏ పరీక్షకి ఏ లంగా ఓణీ వేసుకెళ్ళాలీ అని ఆలోచించినంత శ్రద్ధగా పాఠాల గురించి ఆలోచించేవాళ్ళం కాదు. అప్పట్లో ఆడపిల్లలం మహా ధైర్యంగా ఉండేవాళ్ళం. పాసయ్యామా కాలేజీలో చేరి డిగ్రీ చదువుకోవచ్చు. లేకపోతే, అమ్మావాళ్ళు మంచి పిల్లాడిని చూసి ఎలాగూ పెళ్ళి చేసేస్తారు. చదివే తీరాలి. ఉద్యోగాలు చేయాలి అనే ఆశయాలేవీ మాకుండేవి కావు. ఆ విషయంలో ఇప్పటి ఆడపిల్లల్ని చూస్తే జాలి వేస్తుంది. పాపం వీళ్ళు కష్టపడి చదువుకోవాలి. సంసారాలు చేయాలి. చుట్టాలని ఆదరించాలి. ఎన్ని బాధ్యతలో. వీటికి తోడు అన్నిటికన్నా కష్టమైనది - అమెరికా వాళ్ళ లాగా ఎప్పుడూ అందంగా కనిపించాలి. ఎందుకంటే, మరి వాళ్ళ సమస్యలు మనకీ వస్తున్నాయి కదా. సిరి అబ్బకపోయినా చిడుమబ్బుతుందని వూరికే అనరు కదా మాకీ గోలలేవీ ఉండేవి కావు. పైగా ఇంజనీరింగ్‌లో చేరకపోతే మీరు మాకు పుట్టలేదనుకుంటామనే అమ్మానాన్నా లుండే వాళ్ళు కారు. పి.యు.సి. ఐపోయాక నేను డిగ్రీలో చేరా. హరికి ఐ.ఐ.టి. లో సీటొచ్చింది. ఆ తర్వాత మా నాన్నగారికి ట్రాన్స్‌ఫరై విజయవాడ వెళ్ళిపోయాం. పదేళ్ళ క్రితం మాస్టారుగారు పోయారని తెలిసి పిన్నిగారిని పలకరించడానికి వెడితే అప్పుడు కలిశాడు. తను జంషెడ్‌పూర్‌లో పెద్ద ఇంజనీరుగా ఉన్నాననీ, ఇంట్లోవాళ్ళంతా తగని మర్యాదలు చేస్తున్నారు - అంటూ నాతో ఓ పావుగంట మాట్లాడాడు. కానీ, పెద్దగా కామన్ ఇంట్రెస్ట్‌లు లేని చోట్ల సంభాషణ జరగటం కష్టం కదా. ఆవేళ కుశల ప్రశ్నలయ్యాక మళ్ళీ నిరుడు బొంబాయిలోనే కలవడం. రాజమండ్రిలో చూసినపుడు దోర జామపండులా ఉన్న వాడు, మిగిల ముగ్గినట్టైపోయాడు. అలా ఐపోయావేంటంటే చెప్పుకొచ్చాడు

జంషెడ్‌పూర్‌లో ఉద్యోగానికి రిటైర్మెంట్ తీసుకుని నాలుగేళ్ళ క్రితం ఠానాలోని ఒక పెద్ద కంపెనీకి యాన్సిలరీ యూనిట్ పెట్టాననీ, రాజమండ్రి ఇల్లు అమ్మేసి బ్యాంకులోనుకి మార్జిన్ కట్టి సుమారు 50 లక్షలు పెట్టుబడి పెట్టాననీ, వాళ్ళ అల్లుడు మార్కెటింగూ, తాను ప్రొడక్షనూ చూసుకుంటున్నామనీ, టేబుల్

కవతలనించీ ఇవతలకి మారేప్పటికి కొంచెం కొత్తచేయడంవల్లా అలా ఉన్నాననీనూ.

సడెన్‌గా అడిగాడు - "అవును సుశీలా, మీ ఫ్యాక్టరీలో ఫోన్లు ఎవరు తీస్తారూ?'

"రాజని ఒకడున్నాడులే. ఎందుకూ?"

"ఏం లేదు. నిన్న ఫోన్ చేశా. ఈవేళ వస్తానని చెప్దామని. అతను చెప్పాడు - అమ్మగారు బయట కెళ్ళారు. అయ్యగారు ఫోన్లో మాట్లాడరని. నీ ఫ్రెండ్‌నని చెబితే ఎప్పుడైనా ఇంటికి వెళ్ళిపోండి. ప్రోబ్లెం ఉండదు అన్నాడు ఇంతకీ నీకు చెప్పనే లేదా?"

"లేదు అతడంతేలే. విసిగిస్తాడు కానీ, మనిషి మంచివాడే!"

ఇంతలోకే, "మట్టి కాళ్ళు! మట్టికాళ్ళు! చెప్పులు వదిలిరండి!" అని అరుస్తున్నా. "నా ఇల్లు, నా ఇష్టం!" అంటూ ఈయన తిన్నగా లోపలికొచ్చేశారు. చెరో కిలో మట్టిపమోస్తున్న చెప్పులతో సహా.

"వద్దంటే చెప్పు. ఇపుడే బైటకెళ్ళిపోతా. అయినా నువ్వేగా పిలిచావు?"

"వచ్చిన వాళ్ళెలాగూ వచ్చారు. మళ్ళీ వెళ్ళి పిలిస్తే ఇంకో రెండు బళ్ళ మట్టి తెస్తారు!" .ఇతను హరి. నా రాజమండ్రి ఫ్రెండు.

"హరీ ఈయనే మావారు. మంచి సైంటిస్టు. 1930 టైపు, భర్తగారు. నిరంతరం ఉజ్వల భవిష్యత్తు గూర్చి ఊహిస్తూ సంతోషపడిపోయే చిన్నకారు పారిశ్రామికవేత్త".

"ఆఁ!చాల్చాలు. ఇతనేనా ముందు నీ ఇంగ్లీష్ నోట్సులిస్తే ట్రిగనామెట్రీ చెబ్తానని ఒప్పుకుని ఆనక టైం లేద న్నాడని నువ్వు చెప్పిందీ?"

అబ్బబ్బ ఈయనకి జ్ఞాపకశక్తి కాస్త తగ్గించి, ఆ జాగాలో లోకజ్ఞానం పెట్టి ఉంటే భగవంతుడు నాకెంతో ఉపకారం చేసి ఉండేవాడు.

"ఆఁ! అతనే ఇతడు". ఇంక ఇపుడు సర్దడానికి ప్రయత్నిస్తే, ఇంకా అభాసవుతుంది. ఐనా అన్ని సంగ తులూ ఈయన చెవిలో ఊదమని నాకెవరు చెప్పారు.

హరి నవ్వుతూ, "స్పర్థతే వర్ధతి విద్యా అని వినలేదా డాక్టర్‌గారూ, నేను హరినారాయణ. ఎప్పట్నుంచో మిమ్మల్ని కలుద్దామనుకోవడమే. ఈ వేళకి వీలు పడింది" అని తన కార్డ్ తీసి ఇచ్చాడు.

"కూచోండి సార్. నేను కార్డులవీ వేయించుకోలేదు. జగమెరగని బ్రాహ్మడ్ని కదా. మీరు మాట్లాడుకుంటూ ఉండండి. ల్యాబ్లో ఒక పక్క పని కొద్దిగా మిగిలిపోయింది. అది పూర్తి చేసి వస్తా!" అంటూ బయటికెళ్ళి పోయారు, ఆ కార్డు నాచేతిలో పెట్టి.

ఇంతలోనే కాఫీతో ప్రత్యక్షమయ్యారు మా అత్తగారు. ఆవిడకెన్నో సార్లు చెప్పాను. ఎవరన్నా వచ్చిన

పుడు మీరు కాఫీ అలా తేకండీ, నా గురించి వాళ్ళేమనుకుంటారనీ. అయినా చెయ్యదల్చుకుంది ఆవిడ చేసే తీర్తారు. వచ్చినవాళ్ళు కాఫీ అయినా తాగకుండా వెళ్ళిపోతారేమోనని ఆవిడ ఆరాటం. నేను కాఫీ ఇస్తా ఇస్తానంటా గానీ కబుర్లొదిలిపెట్టి లేవను. నాపాలసీ ఏంటంటే, వచ్చినవాళ్ళు మనల్ని కలవాలని వస్తారు కానీ వెధవ కాఫీ కోసం వస్తారా ఏమిటి. ఇంతకీ అసలు రహస్యం ఏమిటంటే, నేను ఎక్కువసార్లు కాఫీ తాగను. కాబట్టి ఇంకొకళ్ళకివ్వను ఓ పట్టాన. ఇంక వచ్చిన వాళ్ళు గంటకైనా కదలకపోతే, అప్పుడు అంటున్నమాట నిలబెట్టుకుంటా. అయినా కాఫీ ఇచ్చేస్తే వాయనమిచ్చేసినట్టేగా.

కుశల ప్రశ్నలవుతూనే ఉన్నాయి. నేను నా మనసులోనే వేంకటేశ్వర స్వామికి దణ్ణాలు పెట్టుకుంటున్నా. పాతికేళ్ళ క్రితం మేం మా యూనిట్ పెట్టినప్పటినించీ నాకు స్వశక్తి మీద పూర్తిగా నమ్మకం పోయింది. అన్నీ ఆ భగవంతుడి మీద భారం వేసి బతకడంలో ట్రైనింగైపోయా. వసూళ్ళు కాని బాకీలన్నీ నీవే అనుకో స్వామీ అనుకుంటూ మొక్కులు తీరుస్తా. అంతే కాదు. నాకు ఏవారం నాడు ప్రాబ్లెం వస్తే ఆ వారం దేవుడికి అప్పజెప్పేస్తా ఆ విషయంలో నన్ను గట్టెక్కించమని. నిన్న శనివారం కదా. మా పవన్‌గాడు నిన్న చేసిన గోల ఏడుకొండలవాడికి విన్నవించుకున్నా.

మేం యూనిట్ పెట్టుకున్న కొత్తల్లో మా పిల్లలు బాగా చిన్న వాళ్ళు. అది కాలక్రమంలో పెరిగీ పెద్దద వుతుందనీ, పిల్లలని ఇంకోచోటికి ఉద్యోగాలకి పంపక్కరలేదని అనుకుని ఊరుకోకుండా పైకి అన్నమాట నిజమే. అదే మా పిల్లాడి మనసులో నాటుకుపోయింది. ఉద్యోగమెందుకు. నా ఫ్యాక్టరీ నేను పెట్టు కుంటానంటాడు. పోనీ, మన దాంట్లో పనిచేయరా కొన్నాళ్ళు అంటే, నాకు నీ దగ్గర నేర్చుకునేందుకేమీ లేదంటాడు. అందరిలోకీ ఆఖరివాడని వీడి మీద మాకు తగని మమకారం. మా ఇంట్లో ఈయనకి భయపడనిది వీడొక్కడే. 23 ఏళ్ళొచ్చినా ఇంకా నాకళ్ళకి వీడు వెన్న గోపాలుడిగానో, వటపత్రశాయిగానో కనిపిస్తాడు. అందుకే కాస్త గారాబం పాలు ఎక్కువైంది.

కానీ, వీడికి సరిగ్గా ఒక్క అబద్ధం కూడా చెప్పడం చేతకాదు. అవసరానికి పనికొస్తాడు కదా అని స్నేహం చేయడం రాదు. పరిచయస్తులని ప్రాణ స్నేహితులయినట్టుగా కావలించేసుకుని సహాయాలడగడం రాదు. తగని బిడియం, స్వాభిమానం మరెన్నో ఆశయాలు కలబోసిన ఆణిముత్యంలాటి వీడిని ఈ బురదలోకి లాగడానికి ప్రాణం ఒప్పకే, మొన్న కాంపస్ ఇంటర్వ్యూలో వచ్చిన ఉద్యోగంలో చేరి కొంత అనుభవం సంపాయించరా అంటే, ఆ ఉద్యోగం అనుభవం ఏం పనికొస్తుందంటాడు.

అసలు మొదట్లో వీడికింత పట్టుదల లేదు. మొన్న సెలవలకి ఇంటికి వచ్చినపుడు ఫ్రెండ్సు, ఫ్రెండ్సం టూ తెగ తిరుగుతూండేవాడు. పొద్దున ఇల్లు విడిచిపెడితే, మధ్యాహ్నమే వస్తాడో, లేక రాత్రికే వస్తాడో, వస్తే

ఎంత మంది పటాలంతో వస్తాడో తెలియక అయోమయంలో ఉండేవాళ్ళం. పదిన్నరకి నిద్ర లేవడం ఏమిటిరా అంటే, పొద్దున్నే నిద్రలేచేవాళ్ళే గొప్పవాళ్ళవుతారని ఏ బుక్సులోనూ లేదని వాదించేవాడు. భ్రాంతిగా పని లేకుండా తిరుగుతున్నాడు కదా అని క్రితంనెలలో ఇండియన్ ఇండస్ట్రీ వాళ్ళు 'పెద్ద పరిశ్రమలు - అనుబంధ, చిన్న మరియూ నలుసు పరిశ్రమలు - వాటి సయోధ్య' అనే పేరుతో పెద్ద హోటల్లో మూడు నాళ్ళ తిరునాళ్ళ పెడితే డబ్బెలాగూ కట్టేం. వీడిని పంపితే కొంతైనా నేర్చుకుంటాడని, నాకు వీలుకాక పోతే వీడిని పంపా. అప్పట్నుంచీ మొదలయ్యింది మా ఇంట్లో. భాగోతం. 'అమ్మా, మార్కెటింగ్ ప్రోబ్లెం లేని ప్రాజెక్టుంటే చేద్దామన్నావా లేదా? మరి స్వయానా హిందుస్థాన్ ఎలెక్ట్రానిక్స్ లిమిటెడ్ టెక్నికల్ డైరెక్టర్‌తోనే మాట్లాడా గదా. మనం తేలిగ్గా చేయగల ప్రోడక్ట్స్ రెడీగా ఉన్నపుడు ఏమిటి నీ అభ్యంతరం?' అని నన్ను వేధించడం మొదలెట్టాడు. పైపెచ్చు వాడి ఫ్రెండు నాన్నగారు బ్యాంకాఫీసర్. ఆయనతో అన్ని వివరాలూ మాట్లాడి వచ్చాడు. ఐదు లక్షల మార్జిన్ కట్టి ఇల్లు కొలేటరల్‌గా పెడితే లోన్ శాంక్షనవుతుందిట. అప్పటినించీ నన్ను వదిలేసి వాళ్ళ బామ్మ ప్రాణం తీయడం మొదలెట్టాడు. ఆవిడేమో మంచి వ్యవహర్త. 'మీ అమ్మ ఒప్పుకుంటే, నీ కన్నా నాకెక్కువెవరురా.' అని వాడి ముందు తమ పెద్దరికం నిలబెట్టేసుకున్నారు. మా కొంపలో ఏదొచ్చినా నా నెత్తి మీదకే.

అసలు ఈ సంగతి మా ఆయన దాకా తీసికెళ్ళనే లేదు. ఉద్యోగాలకోసం ఎగబడవద్దు. ఇండస్ట్రీలు పెట్టండి. అని ప్రభుత్వం వాళ్ళు సలహాలస్తే ఇవ్వచ్చుగాక. వాళ్ళ సొమ్మేంపోయిందీ. పట్టుమని పాతికేళ్ళైనా లేని ఈ పిల్లలు లక్షలలో లావాదేవీలు ఎలా చేస్తారు. ఇవేమైనా ఉద్యోగాలా? ఎన్ని తప్పులు చేసినా కాల ప్రవాహంలో ప్రమోషన్ల నిచ్చెనలెక్కి సీనియర్లై పోవడానికి. ఆయువు పట్టులో ఒక్క పొరబాటు జరిగితే చాలదూ. జీవితమంతా అనుభవించడానికి. మొదటి రెండేళ్ళలో టేకాఫ్ చేయలేని ఎన్ని చిన్న ఇండస్ట్రీలకి మళ్ళీ బతికేందుకు అవకాశం దొరికింది. ఆ విషయం ఎంత గట్టిగా చెప్పినా, పరాయివాళ్ళ ఖర్చు మీద కొంత లోకానుభవం సంపాయించూ అంటే వినడు. గట్టిగా చెబితే గోల చేస్తాడు. మా అత్తగారి బాల్ నా కోర్టులో పడ్డాక ఏం చేయాలో దిక్కు తోచక ఆ ఏడుకొండలవాడి శరణుజొచ్చా. ఈ వేళ ఈ హరి నారాయణుడిగా ప్రత్యక్షం అయ్యాడు. మరో ప్రయత్నం చేసి చూస్తా. వీడిని లేపి తీసుకొస్తా.

"ఓ దొరా! లే నాయనా! ఈ వేళ ఆదివారం. ఇది మధ్యాహ్నం. ఇప్పుడు మూడయ్యింది. ఇంకా పడుకున్నా వంటే మళ్ళీ రాత్రి నిద్ర పట్టదు. రాజమండ్రిలో నా చిన్ననాటి ఫ్రెండ్ హరి , మా క్లాస్‌లో ఎపుడూ ఫస్ట్ వచ్చేవాడని చెప్తూ ఉంటానే? ఆయన వచ్చారు. కాస్త నువ్వు ముఖం కడుక్కుని బయటకి రా. నిన్ను పరిచయం చేస్తా!"

"ఎప్పుడూ ఫస్ట్ వచ్చే ఆయన నీకు ఫ్రెండెలాగయ్యాడే. సరే వస్తా, కానీ నాకు ఆయనకి ఏమిటి కామన్ నెస్. నేను నీ కొడుకునవటం తప్ప!"

"పోనీ, అంతే అనుకో! నువ్వేదో యాన్సిలరీ ఇండస్ట్రీ పెట్టి నన్నుద్ధరిస్తానంటున్నావుగా? ఆయన రాణాలో మేయర్ అండ్ బెక్కర్ ట్రాన్స్ ఫార్మర్ కంపెనీకి నాలుగేళ్ళనించి ఇంజనీరింగు కాంపొనెంట్స్ సప్లయి చేస్తున్నారు. మొన్న మీ మీటింగ్ లో చెప్పిన అనుబంధ పరిశ్రమ లాగానే. ఇదివరకు జంషెడ్పూర్లో జి.ఎం.ప్లానింగ్గా వుండేవారు. నిరుడు బాంబే కాన్ఫరెన్స్కి వెళ్ళా చూడు. అక్కడ కలిసినపుడు చెప్పారు, వాళ్ళ అల్లుడితో కలిసి యూనిట్ పెట్టానని! హైదరాబాదు వచ్చినపుడు మనింటికి రమ్మంటే ఈ వేళ వచ్చారు. ఆయనతో మాట్లాడితే నీకేమైనా ఉపయోగిస్తుందేమోనని నిన్ను నిద్ర లేపా. ఇక మరి నీ ఇష్టం!"

"ఇదిగో ముందే చెప్తున్నా. ఆయన తన పనిమీదే అనుకోకుండా వచ్చారని ఎన్ని చెప్పినా నమ్మేది లేదు. నీ సంగతి నాకు బాగా తెలుసు. నువ్వెన్ని కుట్రలు పన్నినా, ఎంతమందిని మనింట్లో ప్లాంట్ చేసినా నే మాత్రం ఆ దిక్కుమాలిన ఢిల్లీ చలిలో చచ్చినా ఉద్యోగం చెయ్యను! "

"ఆ సంగతి తర్వాత. ముందు నువ్వు బయటికి రా! "

హరీ, వీడు మా ఆఖరివాడు. మొన్ననే కోయంబత్తూరులో బి.టెక్. ఎలక్ట్రానిక్స్ పాసయ్యాడు. పవన్. పేరుకి తగ్గట్టే తిరుగుతుంటాడు. ఈ వేళప్పుడు ఇంటో ఉన్నాడంటే నీ అదృష్టం. ఢిల్లీలో ఉద్యోగం వచ్చింది. ఈ నెలాఖరులోగా జాయినవ్వాలి!"

"నమస్కారమండీ, మా అమ్మ చెప్పినవన్నీ జరగాలని లేదు. నేను బి.టెక్. పాసయ్యిన మాట నిజం. ఇంకా ఏం చెయ్యాలో నిర్ణయించుకోలేదు. మీరు చిన్నప్పుడు చాలా బాగా చదివేవారని, అమ్మ ఎపుడూ తల్చుకుంటూ ఉంటుంది!"

హరి చాలా మొహమాటపడిపోయాడు.

"మాకు అప్పట్లో ఇంకేమైనా చెయ్యెచ్చని, చేస్తారని కూడా తెలీదోయి! ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అనేదే లేదుగా! పెద్దలు చదువుకోమంటే చదువుకోవడమే. మా పిల్లలు పెద్దవాళ్ళయ్యేవరకు ఎందుకు ఏమిటి అని అడగవచ్చునని కూడా తెలియదు '.

నెమ్మదిగా వాళ్ళిద్దరూ మాటల్లో పడ్డారు. మావాడు అన్నీ ఆసక్తిగా అడిగి తెలుసుకుంటున్నాడు. వెదకబోయిన తీగ కాలికి తగిలినట్టు ఈ హరి రాకవల్ల ఐనా మావాడి మనసు మారితే బావుణ్ణు. నేనెంత అనుభవంతో చెప్పినా అమ్మల మాటలని ఏ పిల్లలు సీరియస్గా తీసుకుంటారు గనక. నేనింకా అక్కడే ఉంటే మావాడన్నీ అడగడేమోనని లాన్లోకి వెళ్ళా, మా ఆయన్నోసారి కదిపి చూద్దామని.

"ఏమిటి మీ ఉద్దేశం? రాకరాక పెద్దమనిషి వస్తే ఇలాగేనా చెయ్యడం. పెద్ద ప్రపంచంలో గడ్డి పీకడానికి మించిన పనేమీ లేదన్నట్టు మీరు ఇవతలకి వచ్చేస్తే మన గురించి అతనేమనుకుంటాడు నాపరువేం కావాలి?"

వంచిన తల పైకెత్తకుండా - "నీ పరువుకొచ్చిన ప్రమాదమేమీ లేదు. నేనింకా పెద్దమనిషిని కాబట్టి చెప్పా పెట్టకుండా ఆదివారం మధ్యాహ్నం రెండున్నరకి వచ్చినా విష్‌చేసి నా పని నే చేసుకుంటున్నా. నీ ఫ్రెండే గా! మాట్లాడుతూ ఉండు. పాపం, నా ఫ్రెండ్స్ సాయంత్రాల వేళ వచ్చినా నువ్వు వాళ్ళకేసి ఎలా చూస్తావో నాకు తెలీదనుకున్నావా?"

"ప్రతి మూడు రోజులకి సాయంత్రం దిగబడి, పదకొండు కొట్టినా కదలని మీ మిత్ర బృందానికీ, ముప్పై ఏళ్ళకి ఒక్కసారి మనల్ని కలిసిపోదామని వచ్చిన ఇతనికీ పోలికేమిటి? అయినా నాకు మీతో వాదనెందుకు? ఇంతకీ, వస్తారా? రా రా?"

"వాదన నేను నీతో పెట్టుకోను. అతను వెళ్ళేముందు కేకెయ్యి! చేతిలో పనయితే వస్తే వస్తా!"

ఇంక లాభంలేదని మళ్ళీలోపలికి వచ్చి, వాళ్ళతో కబుర్లు కలిపా.

"అవును హరీ, ఇంతకీ మీ యూనిట్టెలా ఉందీ?"

"ఫరవాలేదు. అదే మీవాడితో చెబుతున్నా!"

"అదేమిటి? మీది హాయిగా వడ్డించిన విస్తరి. మాకు మల్లే, వారా వీరా అందరినీ ఆశ్రయించవ క్కరలేదుగా?"

"వడ్డించిన విస్తరే అనుకో. కాకపోతే, జైలు భోజనంలా ఉంది. మేం నెలకి ఎన్ని కాంపొనెంట్స్ సప్లై చెయ్యాలో మాకు తెలీదు. వాళ్ళకీ తెలీదు. కానీ ఎంతకి చేయాలో మాత్రం వూరికి ముందరే నిర్ణయమై పోతుంది. ఈవేళ ఫోన్లో ఆర్డరిస్తే ఎల్లుండికెల్లా డెలివరీ ఇచ్చేయాలి. మళ్ళ పదిరోజులు మేమూ, మా వర్కర్లూ భజన కార్యక్రమమే. వాళ్ళొక్కరోజు స్టాకు కూడా ముందు పెట్టుకోరు. అదేమిటంటే, చేతనైన వాళ్ళున్నారు. మీవల్ల కాకపోతే తప్పుకోండంటారు. సరే అంటేనే సర్వైవలు. చెయ్యితిరిగిన పనివాళ్ళని తీసెయ్యలేకా, వుంచుకుని ఊరికే జీతాలిచ్చుకోలేకా మా తల ప్రాణం తోకకి వస్తోంది! మనకే ప్లానింగూ అక్కరలేదని వాళ్ళ అభిప్రాయం. మీ కష్టనష్టాలతో మాకేం పని అన్నట్టుంటారు".

"ఐనా ఆర్డర్ల విషయంలో కొంత మినిమమ్ గ్యారంటీ ఉంటుందిగా. మాలాగా బజార్నపడి తిరగ క్కరలేదు".

"మంచి మాటే! మార్కెట్ ప్రభావం ఇండైరెక్ట్‌గా భరించేది మేమేగా! మా కంపెనీకి 75శాతం అన్నీ

యాన్సిలరీల ద్వారానే. వాళ్ళ బాధ్యత ఫినిషింగ్, బ్రాండ్‌నేమ్. రెండు మూడేళ్ళనించీ లిబరలైజేషన్ ప్రభావం ఆ కంపెనీ మీద బాగా పడింది. నెలకి అధమ పక్షం ఏడెనిమిది లక్షల వర్క్ చేస్తేనే గానీ మాకు బ్యాంకు వడ్డీ అయినా రాదు. ఇప్పుడు నెలకి 3-4 కూడా అవట్లేదు. అదీగాక అగ్రిమెంట్‌లో 60 రోజుల్లో పేమెంట్ అని ఉన్నా ఈ మధ్య నాలుగయిదు నెలలు పడ్తోంది. అది కూడా దఫాలుదఫాలుగా ఇచ్చేప్పటికి ఏ పంటికిందకీ రావట్లేదు.అందుకే బైట పనులేమైనా చేద్దామని మొన్న కుషాయిగూడాలో ఏదో జాబ్‌వర్క్‌కి టెండర్ పడితే అప్లై చేశా. ఆ పని మీదే ఈ ఊరొచ్చాను. నీకెవరైనా తెలిసినవాళ్ళుంటే చూడరాదూ!"

"అలాగే. నాకా లైన్లో అంతగా ఎవరూ తెలీదు. అయినా ప్రయత్నిద్దాం. నువ్వెళ్ళేపుడు వివరాలిచ్చి వెళ్ళు!"

ఇంతలోకే ఈయన లాన్లో పని పూర్తిచేసి చెప్పులు బయట వదిలి వచ్చి కూర్చున్నారు.

"ఏమిటి? సంకుర్మయుడు దేనిమీద నడుస్తున్నాడు?"

"మాకు వేరే టాపిక్సేమున్నాయి! తను రోలు! నేను మద్దెల!"

"మరేం సలహా ఇస్తున్నావు? ఏకంగా పెద్ద ఇండస్ట్రీ పెట్టేయమనా ప్రజాధనంతో! యాన్సిలరీలు చల్లగా ఉండాలే కానీ పెద్ద వర్కింగ్ కాపిటల్ అవసరం లేదనా?"

"పెద్ద యూనిట్టే పెట్టుకుంటే పోయేదేమో. అప్పట్లో ధైర్యం చాలలేదు. మనబండి ఒక్క జీవితకాలం లేటుగా నడుస్తోంది. ఇప్పుడు మంచి అనుభవం వచ్చింది కానీ, అవకాశాలొచ్చేలా లేవు! మా వాళ్ళు యాన్సిలరీలని 300 నించీ 60కి తగ్గిస్తారట. ఇంతమందితో వేగలేక పోతున్నారట. మాలో ఒకళ్ళతో ఒక్కళ్ళని కలవమంటున్నారు. తప్పేట్టులేదు. అసలే ఇది మెర్జర్ల దశాబ్దం కదా! యూనిట్ మూసెయ్యకుండా ఉండ డానికి కొత్త అప్పులు చేసేకన్నా ఇంకొకళ్ళతో కలవడమే మంచిదనిపిస్తోంది!"

"సరిపోయింది. ఇంకా ఏదైనా పెద్దవాళ్ళకి యాన్సిలరీ అయినా కాకపోతినని అస్తమానం బాధపడేదాన్ని. అనుబంధాలని నమ్ముకుంటే ఇక్కడకూడా అంతేనన్నమాట! హరీ! ఈ పూటకి ఉండిపోరాదూ. భోజనం చేసి వెడుదువుగానీ!"

"లేదులే. ఈసారి వచ్చినప్పుడు ముందుగా చెప్పి వస్తా. ఒక ఫ్రెండుని కలవాలి. మారేడ్‌పల్లి లో ఇవిగో మా టెండర్ వివరాలు. వీలుంటే చూడు. నెలాఖరులోగా తేలుతుందన్నారు". "వస్తానండీ! మళ్ళీ కలుద్దాం!"

"అమ్మా! అంకుల్‌ని డ్రాప్‌చేసి వస్తా" నని మావాడు స్కూటర్ తీశాడు. రాత్రి పదిన్నర వరకు ఎదురు చూసి వాడి కారియర్ బల్లమీద పెట్టేసి నడుం వాల్చా. మాఁగన్ను పడిందో లేదో నా మీద చిన్న కాగితం ఉండ. చిన్నప్పుడెవరూ నాజోలికి వచ్చేవాళ్ళు కాదు కానీ మా వాడు పెద్దయ్యాక వాళ్ళ నాన్నకి మెలకువ

రాకుండా నన్ను పిలవడానికి మావాడు సొంత తెలివి ఉపయోగించి కనిపెట్టిన వినూత్న విధానం వల్ల అప్పుడప్పుడూ నామీద ఈ కాగితం ఉండలు పడుతూ ఉంటాయి.

"ఏరా, నన్ను అర్ధరాత్రి నిద్రలేపకపోతే నీకు తోచదా?"

"కాదే! చూడు ఏం తెచ్చానో?" చేతిలో రెండు బటర్‌స్కాచ్ ఐస్ క్రీంలు

"ఏమిటి విశేషం? మీ బ్యాంకాయన బామ్మ సంతకానికేమన్నా ఆల్టర్‌నేటివ్ చెప్పాడా!"

"అబ్బ! అక్కడికి నేనసలు వెళ్ళనే లేదు! అంకుల్‌తో మాట్లాడుతూంటే టైమే తెలియలా. వీళ్ళకి మార్చి లోపల ఐ.ఎస్.ఓ-9000 తెచ్చుకోవాలన్నారట. రెండున్నర లక్షల మార్జిన్ కడితేనే గానీ బ్యాంకువాళ్ళు ఇవ్వమన్నారట. అందుకే మారేడ్‌పల్లిలో వాళ్ళ బంధువొకాయన రిటైర్డ్ ఆఫీసర్. ఆయన్ని అప్పు అడగటానికొచ్చారట".

"అవును మరి. ఇంటర్నేషనల్ మార్కెట్‌లో నిలబడాలంటే క్వాలిటీ పెంచుకోవాలి కదా. క్వాలిటీ ఊరికే ఎలా వస్తుంది. ఎన్నో జాగ్రత్తలు తీసుకోవాలి. ఎంతో టెస్టింగ్ ఎక్విప్‌మెంట్ కొనుక్కోవాలి. వీళ్ళ ప్రిన్సిపల్స్ సాయం చేయకుండా ఉంటారా?"

"ఏం చెయ్యరుట. అసలు వీళ్ళ వైపునించి సప్లయర్స్‌గా రిజిస్టరవడమేగానీ, ఇంత మినిమం గ్యారంటీ ఆర్డర్లని గానీ, ఇన్నేళ్ళపాటుంటాయనిగానీ ఏముండదుట. మన బ్యాంకు లోన్లపుడు లాగానే వాళ్ళ ఫార్మాట్స్ మీద దడదడా సంతకాలు పెట్టడమే. ఏంటో, అవసరంగా మంచి ఉద్యోగం వదులుకుని వచ్చి ఈ త్రిశంకు స్వర్గంలో పడ్డానని అంకుల్ చాలా బాధపడ్డారు!"

"అవును పాపం! అభిమన్యుడిలా లోపలికెళ్ళడమే కానీ, బయటపడ్డం ఎవరివల్లా కావడం లేదు. పని ఎక్కువ లేకపోయినా మంచి మార్జిన్ ఉన్నా నెగ్గుకుని రావచ్చు!"

"అదీ లేదుట! రా మెటీరియల్స్, ఓవర్‌హెడ్స్, లేబర్- అన్నీ వాళ్ళే లెక్కలేసి కొద్దిగా మార్జిన్ ఇచ్చి రేటు నిర్ణయిస్తారుట. మూడు సంవత్సరాల క్రితం 1000 రూపాయలకిచ్చిన ఐటం ఇప్పుడు 700కే ఇవ్వాల్సి వస్తోందిట. ప్రతీ ఆరునెల్లకీ ధరలు తగ్గించమని బేరాలుట. వింటుంటే నాకు మతిపోయిందనుకో!"

"పోన్లే, మన పనే నయం. ఇంత ఆరళ్ళు లేవు. ఐస్‌క్రీం బావుందిరా. పడుకో ఇక. నే పొద్దున్నే గుడి కెళ్ళాలి".

మర్నాడు వంటింట్లో కాఫీ కలుపుతూంటే మావాడు ఎవర్తోనో ఫోన్లో మాట్లాడుతున్నాడు "సారీరా! నాకు కుదరదు. మా అమ్మ అర్జెంట్‌గా ఢిల్లీలో ఏదో పనుంది చూసిరమ్మని బతిమాల్తోంది! పదిరోజులు పట్టొచ్చు!

'హమ్మయ్య!' అనుకుని నా ఇష్టదైవానికి నమస్కారాలు పెట్టుకున్నా!!"